క్లుప్తంగా

కార్మికుల వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్యాలయాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, భద్రత, పురుగు నివారణ సిబ్బందికి వేతనాలు పెంచాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ వేధింపులు ఆపాలని, వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక సంస్థ ద్వారా ప్రతి నెల రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. బాలకృష్ణ, కుళాయిస్వామి, శ్రీనివాసులు, సుశీలమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

శిరివెళ్ల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అటెండర్ సలీం పదవీ విరమణ చేశారు. ఈ మేరకు సోమవారం కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ రేణుక, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, సహకార సంఘాల సీఈఓలు బేగ్, దస్తగిరి, సిబ్బంది అటెండర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా 40 ఏళ్లుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నానో ఎరువులతో ప్రయోజనం

గోస్పాడు: నానో ఎరువులతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని నంద్యాల జిల్లా ఇఫ్కో మేనేజర్ మధుబాబు తెలిపారు. మండలంలోని దీబగుంట్లలో సోమవారం సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇఫ్కో నానో మోడల్ గ్రామంగా జిల్లాలో దీబగుంట్ల గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. డిజిటల్ వ్యవసా యం దిశపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇఫ్కో నానో ఎరువులు, సాగరిక మందుల కొనుగోలు గరిష్ట చిల్లర ధరపై 25 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఎరువులను డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేస్తే ఎకరాకు రూ.100 చొప్పున రైతులకు అందజేస్తామన్నారు.

పోస్టల్ సేవలు ఎనలేనివి

నంద్యాల(అర్బన్): పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు పేర్కొన్నారు. జాతీయ తపాలా ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా తపాలా శాఖలో 35ఏళ్లు పోస్టుమెన్‌గా సేవలు అందించిన ఆనందరావును శాలువాతో సత్కరించారు.అలాగే జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పట్టణానికి చెందిన శ్రీకరి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ విజైబాబు, డాక్టర్ జావీద్‌ను సన్మానించారు. చాబోలు సలాం, రత్నమయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షన్ తీసుకుని.. వృద్ధుడు మృతి



చివరిసారిగా పింఛన్ అందుకుంటున్న పెద్ద సుబ్బరాయుడు

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు గ్రామానికి చెందిన తెలుగు పెద్దసుబ్బరాయుడు(75) పింఛన్ తీసుకున్న కొద్దిసేపటికే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. టీడీపీ గ్రామ నాయకులు భవనాశి వెంకటసుబ్బయ్య, కృష్ణచైతన్యతో పాటు సచివాలయ హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సుబ్బరాయుడు ఇంటికి వెళ్లి పింఛన్‌ను అందించారు. సొమ్ము తీసుకున్న 15 నిమిషాలకే సుబ్బరాయుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

వర్షం...హర్షం



డబ్ల్యూ గోవిందిన్నె వద్ద పారుతున్న వాగు

దొర్నిపాడు: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పొలాల్లో వర్షపు నీరు పారింది. అలాగే వాగులు వంకలు ప్రవహించాయి. వర్షం రాకతో రైతులు విత్తన పత్తి నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ పత్తి రైతులు లాభాలు పొందారు. ఈ ఏడాది సాగువిస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



ఎంఎస్ నగర్‌లో రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల(అర్బన్): కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఎండీయూ వాహనదారులకు సూచించారు. పట్టణంలోని ఎంఎస్ నగర్, ఎన్‌జీఓ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. రోజుకు 120 - 150 కార్డుదారులకు రేషన్ అందించాలని చెప్పారు. 17వ తేదీలోపు పంపిణీ పూర్తయ్యేలా చూడాలన్నారు. డీఎస్‌ఓ వెంకటరాముడు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎస్‌డీటీ ప్రసాదరావు ఉన్నారు.

ఇంటికి చేరని పింఛన్



ఓబులంపల్లెలో రచ్చబండ వద్ద పింఛన్ల పంపిణీ



శ్రీరంగాపురంలో అందరికీ ఒకేచోట ఇస్తున్న దృశ్యం



రుద్రవరంలో టీడీపీ నాయకుడు గురుమూర్తి ఇంటివద్దనే పింఛన్ల పంపిణీ



డబ్ల్యూగోవిందిన్నె సచివాలయంలో పాత పింఛన్ పుస్తకాలతో ఎదురుచూస్తున్న వృద్ధులు

- ఎక్కడంటే అక్కడ పంపిణీ చేసిన వైనం
- చాలా గ్రామాల్లో సచివాలయాల వద్ద అందజేత
- టీడీపీ నాయకుల హల్‌చల్
- సతాయించిన సర్వర్
- డివైజ్‌లు పనిచేయక అవస్థలు పడిన సచివాలయ ఉద్యోగులు
- ఆందోళన చెందిన లబ్ధిదారులు





నంద్యాలలో మహిళకు పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్, మాజీ మంత్రి ఏరాసు, దొర్నిపాడులో మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: పింఛన్ల పండుగా అంటూ ఎంతో ఆర్భాటం చేసిన కూటమి ప్రభుత్వం తొలిరోజే లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. టీడీపీ నాయకులు ఇళ్ల వద్దకు, సచివాలయాల వద్దకు లబ్ధిదారులను పిలిపించి పంపిణీ చేశారు. దీంతో ఉదయం లేచింది మొదలు లబ్ధిదారులు నాయకుల ఇళ్ల వద్దకు, ప్రధాన కూడళ్లకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. దొర్నిపాడు మండలం వెంకటేశ్వరనగరం గ్రామంలో 33 మంది లబ్ధిదారులకు పింఛన్ నిలిపివేయాలని టీడీపీ నాయకులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అలా చేయొద్దని.. పంపిణీ చేయకపోతే తమ ఉద్యోగాలు పోతాయని అధికారులు బతిమాలి పంపిణీ చేశారని సమాచారం.

దొర్నిపాడు: కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీని సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులతో పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. అయితే సోమవారం పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లు తెలుసుకోవడానికి అగచాట్లు పడ్డారు. కొంతమంది దిక్కుతోచక వలంటీర్ల సాయం తీసుకోగా.. వారిని టీడీపీ నాయకులు బెదిరించారు. అలాగే మరికొన్ని చోట్ల సర్వర్, డివైజ్‌లు పనిచేయలేదు.

పింఛన్‌దారులకు తప్పని తిప్పలు

రుద్రవరం: మండలంలోని పింఛన్‌దారులకు తిప్పలు తప్పడం లేదు. పింఛన్ దారుల ఇంటి వద్దనే సొమ్ము అందజేస్తామని టీడీపీ ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. పెంచిన పింఛన్,మూడు నెలల అరియర్స్ కలిపి రూ.7వేలు చేతికందినప్పటికీ రచ్చ బండలు,దర్గాలు,ప్రార్థనా మందిరాలు,టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం అంకాలమ్మ గుడి వద్ద ఉన్న ప్రధాన రహదారుల్లో నీళ్లు నిలుస్తున్నాయని, రోడ్డు వేయాలని మహిళలు కోరగా త్వరలో వేయిస్తామని చెప్పారు. టీడీపీ నాయకులు సిద్ధి సత్యం, సిద్ధినారాయణ, గంగవరం కృష్ణారెడ్డి ఉన్నారు.

మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో దాదాపు 6,401 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారందరికీ సొమ్ము ఇంటి వద్దనే సొమ్ము అందజేయాలని ముందస్తుగానే అధికారులు సచివాలయ సిబ్బందికి మ్యాపింగ్ చేశారు.వారికి పంపిణీ చేయాల్సిన సొమ్మును తీసుకొని సోమవారం ఉదయాన్నే పింఛన్ దారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లారు. అక్కడ వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయించారు.అనంతరం సర్వర్లు పనిచేయడం లేదని ఒక ప్రదేశానికి పిలిపించి సొమ్ము అందజేశారు. శ్రీరంగాపురంలో రెండు ప్రదేశాల్లో ఇళ్లవద్ద, చిన్నకంబలూరు, ఆల మూరులో అధిక శాతం గ్రామ సచివాలయం వద్ద, పేరూరులో చర్చి వద్ద, బి.నాగిరెడ్డిపల్లెలో దర్గా వద్ద ఇలా వారికి నచ్చిన ప్రదేశాలకు లబ్ధిదారులను పిలిపించి సొమ్ము అందజేశారు. కొంతసేపటి తరువాత సర్వర్ పని చేయడంలేదని 11.30 వరకు పంపిణీ ముందుకు సాగలేదు. దీంతో లబ్ధిదారులు సొమ్ము చేతికందుతుందో లేదోనని గ్రామ సచివాలయాల వద్దకు పరుగులు తీశారు. దీంతో అధిక శాతం మందికి అక్కడే అందజేశారు.

ఉయ్యాలవాడ : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సోమవారం పంపిణీ చేపట్టినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. మండలంలోని మాయలూరు, అల్లూరు, రూపనగుడి, తుడుమలదిన్నె గ్రామాల్లో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారని వెల్లడించారు. ఉయ్యాలవాడలో పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, నాయకులు బోరెడ్డి నర్సిరెడ్డి, దస్తగిరిరెడ్డి, అర్జిగారి నరసింహులు, బలిజ సంఘం అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి, గ్రామాల్లో నాయకులు కూడాల నారాయణరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, కుప్పరిమీని వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల ఓబులేస్ పింఛన్ సొమ్ము అందజేశారు.

శిరివెళ్ల: పింఛన్ పంపిణీలో మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హల్‌చల్ చేశారు. ఈఓఆర్డీ నాగేంద్ర పంపిణీని పర్యవేక్షించారు.

నంద్యాల(అర్బన్): మండలంలో సోమవారం పింఛన్లు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశామని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. చాపిరేవుల గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై పలువురికి పింఛన్ సొమ్ము అందజేశారు. కాగా పింఛన్ సొమ్ము ఎక్కడ.. ఎవరు ఇస్తారో తెలియక పింఛన్‌దారులు అయోమయానికి గురయ్యారు. చాబోలు గ్రామంలో అవుకు శివమ్మ తనకు రూ.4వేలు మాత్రమే పింఛన్ సొమ్ము వీఆర్‌ఓ శ్రీరాములు ఇచ్చారంటూ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసింది.

హామీలు నెరవేరుస్తాం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేరుస్తామని, ఇందులో భాగంగా పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 10వ వార్డు కల్పనా సెంటర్, బైరమల్ వీధి, ఫరూక్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.



గుండంపాడు సచివాలయం వద్ద పింఛన్లను అందజేస్తున్న సర్పంచ్, టీడీపీ కార్యకర్తలు



చాపిరేవులలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



బాచేపల్లిలో ఒకే ఇంటి వద్ద అందరికీ పింఛన్ల పింపిణీ



టీ.లింగందిన్నెలో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



బి.నాగిరెడ్డిపల్లెలో దర్గా వద్ద టీడీపీ నాయకులతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్న దృశ్యం



పేరూరులో చర్చి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



ఉయ్యాలవాడ చాకలివీధిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న టీడీపీ నాయకులు



కోటకందుకూరులో రోడ్డుపైనే పింఛన్ సొమ్మును లబ్ధిదారుకు అందజేస్తున్న దృశ్యం



శిరివెళ్లలో పింఛన్ ఇస్తున్న టీడీపీ కార్యకర్త



డబ్ల్యూ గోవిందిన్నెలో సచివాలయంలోనే పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

అతిసార వ్యాధిని అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



నర్సాపురం పీహెచ్‌సీ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాబు

నంద్యాల(న్యూటౌన్): ప్రాణాంతకమైన అతిసార వ్యాధిని అరికట్టేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకు రావాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో స్టాప్ డయేరియా కాంపెయిన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి ఫరూక్, కలెక్టర్ శ్రీనివాసులుతో పాటు మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అతిసార వ్యాధి ద్వారా మరణాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డాక్టర్ జాఫ్రుల్లా, రవికృష్ణ, డాక్టర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

డయేరియా, డెంగీ నివారణే లక్ష్యం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో డయేరియా, డెంగీ వ్యాధుల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో అత్యవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం సూచనలు చేసిందన్నారు. అనంతరం స్థానిక వైద్యశాలనుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండండి

రుద్రవరం: అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు, నర్సాపురం పీహెచ్‌సీ వైద్యులు గాయిత్రీ, బాబు ప్రజలకు సూచించారు. వర్షాలు కురుస్తుండంతో అతిసారం, డెంగీ జ్వరం సోకే ప్రమాదం ఉందని పీహెచ్‌సీల వైద్య బృందం సోమవారం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆయా వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవలసిన లక్షణాలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. పీహెచ్‌సీల, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జడ్జి ఆదినారాయణ



పాల్గొన్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): దేశ వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు, పోలీసు సిబ్బందికి మండల లీగల్ సెల్, చైర్మన్ మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ మాట్లాడుతూ ఐపీసీ క్రిమినల్ ప్రొసిజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినీయం చట్టాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా పోలీసు స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాధితుడు ఇకపై నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, అరెస్ట్ వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌తో పాటు జిల్లా ప్రధాన కేంద్రాల్లోనూ బహిరంగంగా ప్రదర్శిస్తారన్నారు. దీని వల్ల బాధితుల కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ముఖ్యమైన సమాచారం తెలిసే వీలుంటుందని చెప్పారు. సమన్లు ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పనిలేదని, ఆన్‌లైన్‌లో పంపించవచ్చన్నారు. మహిళలపై నేరాల విషయంలో బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మెజిస్ట్రేట్ ఎదుట నమోదు చేసుకోవచ్చని, వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలని పేర్కొన్నారన్నారు. ముఖ్య విషయాలను వివరించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రాధారమణి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి, పీపీ శ్రీనివాసులు, వివేకానందరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూపని వెంకటేశ్వర్లు, బాబు, జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్‌బాబు, సుబ్బరాయుడు, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించండి

ఉయ్యాలవాడ : నాలుగు నెలల క్రితం భూములు అమ్ముకున్నాం.. కొన్నవారికి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వలేకపోతున్నామని సమస్యను పరిష్కరించాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇంజేడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, గురుమూర్తి తదితర రైతులు కార్యక్రమానికి హాజరై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రీసర్వే నిలిపివేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రిజిస్టర్ కార్యాలయం, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ చెప్పారు.

ఆ చట్టాన్ని రద్దు చేయాలి



శ్రీనివాస సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో, ట్రాలీ డ్రైవర్ల యూనియన్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): డ్రైవర్లను జైలుకు పంపే భారత, న్యాయ సంహిత చట్టాలను రద్దు చేయాలని ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్టు రంగాన్ని నాశనం చేయడానికి, డ్రైవర్లపై ధరల భారాన్ని మోపేందుకు, రవాణా భద్రత చట్టం పేరుతో డ్రైవర్లను జైలులో వేయాలనే కుట్రను విరమించుకోవాలంటూ పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. భారత న్యాయ సంహిత చట్టం 106(1,2) సెక్షన్లను రద్దు చేయాలని కోరారు. జాతీయ రహదారులపై డ్రైవర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియం ,టోల్ చార్జీలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాయక్, శ్రీనివాసులు, చంటి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రాజస్థాన్ వాసుల మృతి

శిరివెళ్ల: కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఇద్దరు రాజస్థాన్ వాసులు మృతి చెందారని ఎస్ఐ సురేష్ తెలిపారు. రాజస్థాన్‌లోని ప్రతాప్‌ఘర్‌కు చెందిన నారాయణ (22) జీవన్‌లాల్ (44) గత నెల 27న నంద్యాల నుంచి గిద్దలూరు వైపు బోర్ వెల్ లారీలో వెళ్తుండంగా ప్రమాదవశాత్తు పచ్చర్ల దాటిన తర్వాత ఘాటు రోడ్ నుంచి లోయలో లారీతో సహా పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. వారి బంధువు సంజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 4వ తేదీన దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు ధనుంజయుడు, రమేష్‌నాయక్, రఫీ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే.. నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు , అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ సెంటర్ నంద్యాలలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ధనుంజయుడు మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

నంద్యాల(అర్బన్): సంఘటిత ఉద్యమాల ద్వారానే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతారని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లును సత్కరించారు. పులికొండన్న మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటాలు సాగిస్తామన్నారు.

ప్రజలకు మేలైన వైద్య సేవలు

నంద్యాల టౌన్: ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆసుపత్రిలోని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని నంద్యాల సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆసుపత్రిని పరిశీలించి తన దృష్టికి వచ్చిన సమస్యలను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు తెలియజేశారని, ఆయా సమస్యలపై కలెక్టర్ సోమవారం తమతో సమీక్ష నిర్వహించి పలు విషయాలు చర్చించారన్నారు. తాము ఆయనకు సమస్యలపై సమాధానమిస్తూ..విద్యుత్ ఉపకరణాలు, నీటి కొరత తదితర సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పామన్నారు. ప్రతిరోజు 30 - 35 మంది రోగులకు ఎంఆర్ఐ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అంతకు మించి వచ్చిన సందర్భంలో మరుసటి రోజు చేస్తున్నామని పేర్కొన్నారు. సిటి స్కాన్ పరీక్షలు రోజుకు 50-60 వరకు జరుగుతున్నాయని, ఏప్రిల్ 14 నుంచి సాంకేతిక సమస్యల వలన సిటి స్కాన్ పరికరం పని చేయటం లేదని, విషయాన్ని ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంస్థకు తెలియజేయగా వారు ప్రత్యామ్నాయంగా ఓ స్కానింగ్ సెంటర్‌లో ఉచితంగా సిటి స్కానింగ్ చేయిస్తున్నారని వివరించామని పేర్కొన్నారు.